
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 14 అక్టోబరు 2025





కల్యాణం..రమణీయం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.. సోమవారం స్వామివారి కల్యాణం రమణీయంగా జరిగింది. పండితుల వేదమంత్రోచ్ఛరణలు, కళాకారుల ప్రదర్శనలు, భక్తుల గోవింద నామ స్మరణతో వాడపల్లి మార్మోగుతోంది. 6

ప్రజా ఫిర్యాదులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : కలెక్టర్

భీమవరం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. అధికారులు ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. సోమవారం ప్రజల నుంచి 95 ఫిర్యాదులు అందాయి. పీజీఆర్‌ఎస్ హాలు వెలుపల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అర్జీదారుల సమస్యల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏ విధంగా జరుగుతున్నది కలెక్టర్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ అప్పారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు ఫిర్యాదులు స్వీకరించారు.



తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌ను పరిశీలిస్తున్న మార్కెట్, సివిల్ సప్లయ్ అధికారులు

ఉల్లి మార్కెట్లో అధికారుల పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి కథనంపై కలెక్టర్ ఆదేశాలు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : 'కడప ఉల్లి ధర ఢమాల్' అని ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌ను పరిశీలించాలని మార్కెట్ యార్డు, రెవెన్యూ, సివిల్‌సప్లయ్ అధికారులకు కలెక్టర్ నాగరాణి ఆదేశాలు ఇచ్చారు. ఉల్లి రైతులకు న్యాయం జరిగేలా దగ్గరుండి మార్కెట్‌ను పర్యవేక్షించాలని సూచించారు. దీంతో మార్కెట్‌యార్డు ఏడీ సునీల్ కుమార్, తాడేపల్లి గూడెం మార్కెట్ కమిటీ కార్యదర్శి గౌస్ భాషా, సూపర్ వైజర్లు ఫణికిషోర్, వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు చెందిన సివిల్ సప్లయ్ డీటీలు తాడేపల్లి గూడెం ఉల్లి మార్కెట్‌ను సందర్శించారు. కడప రైతులతోను, ఉల్లి వ్యాపారులతో మాట్లాడారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యాపారులను కోరారు. దీనిపై వ్యాపారులు కూడా స్పందించారు. నాణ్యమైన ఉల్లి కడప నుంచి రాకపోవడం వల్లే కొనుగోలు చేయడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో ధర తక్కువగా పలుకుతుందని అధికారులకు వివరించారు. నాణ్యమైన ఉల్లిని కొనుగోలు చేయడానికి తాము ముందుంటామని వ్యాపారులు భరోసా ఇచ్చారు. ఇదిలా ఉంటే తాడేపల్లిగూడెం మార్కెట్‌కు కడప నుంచి నాలుగు లారీల్లో ఉల్లి వచ్చింది. దీని ధర క్వింటా రూ.600 నుంచి రూ.1200 వరకు నిర్ణయించారు. తీసుకొచ్చిన 4 లారీల్లో మూడు లారీల్లో వచ్చిన ఉల్లి నాణ్యతగా ఉండటంతో క్వింటా రూ.900 నుంచి 1200 మధ్య ధర పలికింది. మరో లారీ నాణ్యత లేకపోవడంతో క్వింటా రూ.600కు విక్రయించారు. మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరక్టర్ (ఆర్‌జే డీఎం) శ్రీనివాస్ మంగళవారం రానున్నారు. వ్యాపారులు, రైతులతోను, సంబంధిత విభాగం అధికారులతో సమీక్షిస్తారు.



భీమవరం ఏఆర్‌కేఆర్ హైస్కూల్‌లో విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

కొత్త టీచర్లు వచ్చారు !

జిల్లాలో 434 ఉపాధ్యాయులు బాధ్యతల స్వీకరణ

భీమవరం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు శిక్షణ పూర్తి చేసుకుని సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో విధుల్లో చేరారు. జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నచోట వీరు చేరారు. ఎస్‌జీటీ కింద 162 మంది ఉపాధ్యాయులు, ఎస్‌జీటీ ఉర్దూ భాషకు ఒక ఉపాధ్యాయుడు చేరారు. హైస్కూల్‌లో ఇంగ్లీష్ సబ్జెక్టుకు 29 మంది, హిందీకి 34 మంది, సంస్కృతం ఒకరు చేరారు. తెలుగు సబ్జెక్టుకు 18 మంది, బయలాజికల్ సైన్స్‌కి 25 మంది, మ్యాథ్స్ 11 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కి 93 మంది ఉపాధ్యాయులు జాయిన్ అయ్యారు. ఫిజికల్ సైన్స్‌కు 9 మంది, సోషల్ స్టడీస్‌కి 51 మంది వారి వారి పాఠశాలల్లో చేరారు.

సంక్షామం

వసతి గృహాల్లో అరకొర సౌకర్యాలు
మరుగుదొడ్డి, మురుగు సమస్యలు
పలు చోట్ల భవనాలు శిథిలం
ఆంధ్రజ్యోతి విజిట్.. 6



జోరు వాన

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల తిరోగమన ప్రభావంతో జిల్లాలో కుండపోతగా వర్షాలు కురిశాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభం అయిన ఈ వర్షాలు మధ్యాహ్నం వరకు ఎడతెరపిలేకుండా కురిశాయి. ఈశాన్య రుతుపవనాలు దక్షిణాది రాష్ట్రాల్లో ప్రవేశం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భీమవరంలో వర్షం





స్తంభించిన జనజీవనం
మునిగిన పల్లపు ప్రాంతాలు
చెరువుల్లా రహదారులు.. ఇబ్బందులు పడ్డ జనం
ఉండిలో అత్యధిక వర్షపాతం 56.8 మి.మీ
రెండురోజుల పాటు భారీ వర్షాలు
వాతావరణశాఖ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన

జలమయమైన పాలకొల్లు బస్టాండ్

పాలకొల్లు టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. మురుగు నీటి డ్రైయిన్లు పొంగి ప్రవహించడంతో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. వ్యాపారాలు స్థంభించాయి. భారీ వర్షం కురిసినప్పుడల్లా ఇదే పరిస్థితి ఉంటోంది. మురుగునీరు, వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుగొండ : పెనుగొండ, చెరుకువాడ, వడలి, సిద్ధాంతం, చినమల్లం, నడిపూడి గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళే సమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయాయి. కూలి పనులకు వెళ్లేవారు ఇళ్లకే పరిమితమయ్యారు.

ఆచంట : ఆచంటలో సోమవారం ఉదయం కురిసిన ఏకదాటి జోరువానకు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అలాగే మండలంలో పలు కాలనీలకు సంబంధించి రహదారులు సైతం నీట మునిగాయి. దీంతో స్థానికులు అవస్థలు పడ్డారు. ఉదయం సుమారు 3 గంటలు పాటు వర్షంకురవడంతో ప్రజలు ఇంటికే పరిమితం అయ్యారు. మధ్యాహ్నం నుంచి వాతావరణం పొడిగా ఉండటంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు.

మొగల్తూరు : పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే సమ యంలో వర్షం కురవడంతో పాఠశాల విద్యార్థులు, ఉద్యో గులు, వర్తకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్ రోడ్డు, గొల్లగూడెం రోడ్డు, కెపిపాలెం, పేరుపాలెం, కాళీపట్నం పడమరలో వర్షం నీరు నిలిచి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తీరంలో మెరక తోటల్లో సాగు చేసిన కూరగాయల తోటల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వంగ, బెండ, బీర, ఆనబ వంటి కూరగాయల తోటలు ఇవకబారి కుళ్ళిపోతుండంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఆకివీడు : భారీ వర్షంతో ఆకివీడు పట్టణం తడిసి ముద్దయింది. సోమవారం ఉద యం 6 నుంచి 10 గంటలు వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులు చెరువులను తలపించాయి. డ్రైన్లు పొంగిపొర్లాయి. పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో ఎత్తుకొని బయట పారపోసుకున్నారు.

కాళ్ళ : ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి రహదారులపై మోకాళ్ళ లోతు పైనే వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాళ్ళ సినిమా హాల్ సెంటర్, శివాలయం వద్ద రాష్ట్రీయ రహదారి చెరువులను తలపించాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఉండి : ఉండి గ్రామంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. ఉండి కాపులపేటలోని మండల పరిషత్ పాఠశాలను వర్షం నీరు చుట్టిముట్టింది. దాంతో విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు. కోండ్రుతుపేట నుంచి జంగాలకాలనీకి వెళ్లే సీసీ రహదారిపై నీరు చేరింది. ఉండి కాపులపేట రహదారి, చెన్నంశెట్టివారి వీధులు ముంపుకు గురైయ్యాయి. యండగండి, చెరుకువాడ, పెదపుల్లేరు., కోలమూరు, పాందువ్వ, ఉప్పులూరు తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

పెంటపాడు: పెంట పాడులో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి సుమారు రెండు గంటలకు మొదలైన వాన తెల్లారే వరుకూ కురుస్తూనే ఉంది. సోమవారం ఉదయం మొదలై మధ్యాహ్న వరుకూ వర్షం కురుస్తూనే ఉంది. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

సోమవారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి జిల్లాలో వర్షపాతం ఇలా ఉంది. ఉండిలో అత్యధికంగా 56.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా నరసాపురంలో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 9.2 మిల్లీమీటర్లు నమోదు కాగా పెంటపాడులో 10.4, తణుకులో 18.4, అత్తిలిలో 6.4, గణపవరంలో 4.8, ఆకివీడులో 38.4, పాలకోడేరులో 30.4, పెనుమంత్రలో 15.2, ఇరగవరంలో 3.8, పెనుగొండలో 7.8, ఆచంటలో 12, పోడూరులో 8.2, వీరవాసరంలో 11.8, భీమవరంలో 19.2, కాళ్ళలో 25.8, పాలకొల్లులో 40.4, యలమంచిలిలో 22.2 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద 344.6 మి.మీ వర్షపాతం నమోదవగా సరాసరి 17.2 మి.మీ నమోదైంది.



భీమవరంలో కలెక్టర్ పరిశీలన

భీమవరం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలో నీట మునిగిన పల్లపు ప్రాంతాలను జిలా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదిన డ్రైన్‌లలో చెత్తా, చెదారం, అడ్డంకులను తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. సుమారు రెండు గంటల పాటు భీమవరం పట్టణం లోని రజకుల కాలనీ, హౌసింగ్‌బోర్డు, ఇందిరమ్మ నగర్, మెంటేవారి తోట, పీపీ రోడ్డు ప్రాంతాల్లో పరిశీలించి మున్సిపల్ అధికారులకు అత్యవసర ఆదేశాలను జారీ చేశారు. పీపీ రోడ్‌లోని రిలయన్స్ పెట్రోల్ బంకు, గోడౌన్‌ల మధ్య ఎన్‌హెచ్ రోడ్డుకు ఇరువైపులా నీరు నిలవడంతో కొత్తగా వేసిన రోడ్డు కూడా పాడవడంపై సంబంధించిన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు వేస్తే సరిపోదని, నీళ్ల నిలిచిపోతే రోడ్లు ఉంటాయా అని ప్రశ్నించారు. మునిసిపల్ కమిషనర్ కే.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ రాంబాబు, ఇంజనీర్ త్రినాథరావు ఉన్నారు.



భీమవరం మండలంలో ఈనిక దశలో సార్వా చేను

సార్వాకు వాన గండం

ఇకపై భారీ వర్షాలు పడితే నష్టం

డెల్టాలో పొట్ట, ఈనిక దశలో లక్ష ఎకరాలు

భీమవరం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సార్వా సాగుకు ఇప్పటి వరకు పడిన వర్షాలు వేరు.. ఇక నుంచి కురిసే వర్షాలు నష్టమే కలిగిస్తాయి. ప్రధానంగా ఈనిక దశలో ఉన్న చేనుకు వర్షాలు నష్టం చేకూరుస్తాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి నాలుగు గంటలు పైగా ఎడతెరిపిలేని వర్షం పడింది. రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. అధిక వర్షాలు పడితే ఈనిక దశలో ఉన్నచేలు నేలకొరిగే అవకాశం ఉంది. మరోపక్క విత్తన పంట మాసూళ్లకు చేరింది. వర్షాలు నష్టంతో పాటు మాసూళ్ళకు అడ్డంకిగా ఉం టాయి. జిల్లాలో 2 లక్షల 11 వేల ఎకరాల్లో సాగు జరగగా మెట్టలో 12 వేల ఎకరాలు ఇప్పటికే మాసూళ్ళు అయ్యింది. 2 లక్షల ఎకరాలు పొట్ట, ఈనిక దశలో ఉన్నాయి. అధిక వర్షాలు పడితే ఆకుముడుత, పొడతెగులు, రావటంతో పాటు తెల్లకంకిలు ఏర్పడే అవకాశం ఉంది.



పెంటపాడులో వర్షం



రహదారులు ఛిద్రం

» వర్షాలతో మరింత అధ్వానం 6
» అడుగడుగునా గోతులు

వర్షంతో మొగల్తూరు-పెంప ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి



రేషన్ బియ్యం అక్రమాలకు చెక్ !

అక్రమ రవాణాకు అడ్డుకట్ట
జిల్లాకు 44 కిట్లు మంజూరు
డబ్బాలో రేషన్ బియ్యం వేస్తే ఎరుపు రంగులోకి మార్పు
40 శాతం బ్లాక్ మార్కెట్‌కే..
అక్రమార్కులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వ వ్యూహ రచన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోవడం పరిపాటిగా మారింది. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రభుత్వం కొత్త వ్యూహ రచన చేసింది. బియ్యాన్ని పట్టుకున్న వెంటనే పరీక్షలు నిర్వహించే కిట్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాకు 44 పరికరాలను కేటాయించింది. వాటిలో రేషన్ బియ్యం వేస్తే ఎరుపు రంగులోకి మారనున్నాయి. బియ్యం బలవర్థకంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పోషక విలువలున్న కెర్నల్‌ను రేషన్ బియ్యంలో కలిపి పంపిణీ చేస్తోంది. బియ్యం, కెర్నల్ ఒకే రంగులో ఉంటున్నాయి. దాంతో తక్షణమే తేల్చడంలో అధికారులకు ఇబ్బందికరంగా ఉంటోంది. జిల్లాలో పౌరసరఫరాల కార్పొరేషన్ ల్యాబ్‌కు పంపి నిర్ధారించాల్సి వస్తోంది.ప్రభుత్వం మంజూరు చేసిన తాజా కిట్‌ల వల్ల అక్కడికక్కడే రేషన్ బియ్యాన్ని నిర్ధారించనున్నారు.కిట్‌లో బియ్యం వేసి రసాయన పదార్థం వాడితే రేషన్ బియ్యంలో ఉన్న కెర్నల్ ఎరుపు రంగులోకి మారిపోతుంది. దాంతో వాటిని రేషన్ బియ్యంగా నిర్ధారించుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోనున్నారు.

కాకినాడకు వెళ్లిపోతున్న బియ్యం

రేషన్ బియ్యం జిల్లాలోనూ బ్లాక్ మార్కెట్‌కు వెళుతున్నట్టు అధికారులు గుర్తిస్తున్నారు. కానీ చర్యలు తీసుకోవడానికి ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. జిల్లాలో ప్రతినెలా 8 వేల టన్నుల బియ్యాన్ని రేషన్‌లో పంపిణీ చేస్తున్నారు. అందులో 60 శాతం బియ్యాన్ని మాత్రమే లబ్ధిదారులు వినియోగిస్తున్నారు. ఖరీఫ్‌లో ఉత్పత్తి అయ్యే బియ్యం సరఫరా చేసినప్పుడు - మిగతా 8లో..

అత్తిలిలో ఆరు నెలల క్రితం రేషన్ బియ్యం పట్టుకున్నారు. అక్కడ పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ లేకపోవడంతో తాడేపల్లిగూడెం నుంచి వెళ్లారు. అర్ధరాత్రి మహిళా డిప్యూటీ తహసీల్దార్ వెళ్లి బియ్యాన్ని సీజ్ చేశారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సదరు బియ్యం శాంపిల్స్‌ను తీసుకురావాలని ఆదేశించారు. అయితే బియ్యాన్ని రవాణా చేసిన వ్యక్తులు పసుపు బియ్యాన్ని జాయింట్ కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. వివాహ సమయంలో వినియోగించే బియ్యాన్ని కొనుగోలు చేశామంటూ అక్రమార్కులు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. జాయింట్ కలెక్టర్ కన్నెర్ర చేశారు. ఎవరిని మభ్యపెడతారంటూ హెచ్చరించారు. బియ్యాన్ని పరీక్ష చేశారు. రేషన్ బియ్యం అని తేలింది.

తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో కొద్ది రోజుల క్రితం తహసీల్దార్ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. లారీలో బియ్యాన్ని తరలిస్తుంటే అడ్డుకున్నారు. అవి రేషన్ బియ్యం కావు... వదిలేయాలంటూ అధికారిపై కూటమికి చెందిన ఓ నాయకుడు ఒత్తిడి తెచ్చారు. మనవాడే వదిలేయాలంటూ ఆదేశించడంతో తహసీల్దార్ ఏమీ చేయలేకపోయారు. ఇటీవల అదే ప్రాంతంలో ఉన్న రేషన్ బియ్యం డెన్‌ను అడ్డుకోవడానికి అధికారులు నానా తంటాలు పడ్డారు. కూమి ఎమ్మెల్యే కూడా అక్రమార్కులను హెచ్చరించారు. దాంతో ప్రస్తుతం సదరు డెన్ నిలిచిపోయింది.



ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్లు ఇవి..వీటి ద్వారా అక్రమాలకు చెక్ పెట్టనున్నారు. ఈ బాటిల్స్‌లో రేషన్ బియ్యం వేసినప్పుడు పోషక విలువల కోసం రేషన్ బియ్యంలో కలుపుతున్న పోర్టిఫైడ్ రైస్ ఎరుపు రంగులోకి మారతాయి.. అక్రమార్కులు ఇక కుంటిసాకులు చెప్పేందుకు వీలుండదు..



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, అర్చకులు

వైభవంగా వాడపల్లి
వెంకన్న కల్యాణం

వాడపల్లిలో నాలుగో రోజుకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు
గోవిందనామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుమల

ఆత్రేయపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. శ్రీనివాసుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పండితుల వేదమంత్రోచ్ఛరణలు, కళాకారుల ప్రదర్శనలు, భక్తుల గోవిందనామస్మరణతో వాడపల్లి మార్మోగుతోంది.

సోమవారం ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను వసంత మండపంలో కొలువుదీర్చారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వర ప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టకలశారాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వస్తివాచనం, ప్రధాన హోమాలు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి జరిపారు. మహారాష్ట్ర కళాకారుల వాయిద్యాలు, మహిళల కోలాటం, కర్రసాము ప్రదర్శనలు భక్తలను ఉర్రుతలూగించాయి. రాత్రి యోగనారసింహ అలంకరణలో శ్రీవారు ముస్తాబై సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. వాహన సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారి అనుగ్రహం పొందారు.




శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, సింహ వాహనంపై శ్రీవారు



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం

ప్రాణం నిలిపే సీపీఆర్

వైద్య విద్యార్థుల అవగాహన కార్యక్రమాలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైన వారి ప్రాణాలను సీపీఆర్(కార్డియో పల్మనరీ రెసిస్టేషన్) నిలబెడుతుందని వైద్యులు తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల, కస్తూరిబా మునిసిపల్ బాలికోన్నత పాఠశాలల్లో అత్యవసర వైద్య ప్రక్రియ వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలు జరిగాయి. మహిళలు, పురుషుల జనాభా నిష్పత్తి సమానంగా ఉండేలా ఆడశిశువులను రక్షించాలని, వారిని చదివించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శోభ మాట్లాడుతూ ఆడశిశువులను రక్షించాలని సూచించారు. గర్భస్థ పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టం (పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు-1994)పై ప్రతీఒక్కరు అవగాహన కలిగిఉండాలని కోరారు. ఈ చట్ట నిబంధనలను అతిక్రమించినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కలిగిస్తామని వైద్య విద్యార్థులతో డీఎంహెచ్‌వో అమృతం ప్రతిజ్ఞ చేయించారు. ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ పూజ, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశిధర్, డీపీహెచ్ఎన్‌వో జ్యోతి, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ హెచ్ఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలు

ఈ నెల 16 వరకు దరఖాస్తు గడువు

ఏలూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటిఐల్లో మిగిలివున్న సీట్ల భర్తీకి ఐదో విడత కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశం కల్పించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ డి.భూషణం సోమవారం తెలిపారు. దరఖాస్తు ప్రింటవుట్‌ను, ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యార్థి తాను ఎంచుకున్న ఐటీఐలో 16న సాయంత్రం 4గంటల్లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. ప్రవేశాలకు ఈ నెల 17న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నంబరు 08812-230269లో సంప్రదించాలని సూచించారు.



ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో రొబోటిక్ సర్జరీ చేస్తున్న వైద్యులు

విర్డ్‌లో రొబోటిక్ వైద్య సేవలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రొబోటిక్ టెక్నాలజీతో విర్డ్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఆసుపత్రిలో ఐదుగురికి రొబోటిక్ ఆర్థో శస్త్రచికిత్స ఈనెల 12న డాక్టర్ కృష్ణకిరణ్ నేతృత్వంలో నిర్వహించినట్లు ట్రస్టు చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు తెలిపారు. వైద్యులు కృష్ణకిరణ్ మాట్లాడుతూ రొబోటిక్ టెక్నాలజీతో ఆపరేషన్ ద్వారా రోగికి మెరుగైన, కచ్చితమైన, రక్షణతో కూడిన వైద్యం అందుతుందన్నారు. సర్జన్ ఆదేశాల మేరకు రోబో పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం వైద్య చికిత్సలను అందించడంలో రోబో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ఈవో ఎస్వీ సత్యనారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, పి.నాగేంద్రబాబు, సింధు, రమ్య, మహిత, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



వరండాలో చదువుకుంటున్న ఏలూరు బీసీ హాస్టల్ విద్యార్థినులు



దెందులూరు హాస్టల్‌లో ఆవరణలో నిలిచిపోయిన మురుగు



పెంటపాడులో శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం

సంక్షామం

- వసతి గృహాలలో అరకొర సౌకర్యాలు
- మరుగుదొడ్డి, మురుగు సమస్యలు
- పలు చోట్ల భవనాలు శిథిలం

సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్స్‌లో దీర్ఘకాలిక సమస్యలకు మోక్షం లేదు. కూటమి ప్రభుత్వం టాయిలెట్లు, గదుల మరమ్మతులపైనే దృష్టి పెట్టింది. విద్యార్థుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. కాస్మోటిక్స్ చార్జీలు నాలుగు నెలల నుంచి విద్యార్థులకు చెల్లించలేదు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఆంధ్రజ్యోతి బృందం సోమవారం హాస్టల్స్ పరిశీలించింది.

దెందులూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించకపోవడంతో విద్యార్థులకు శాపంలా మారాయి. దెందులూరు మండలం కొవ్వలి సాంఘిక సంక్షేమ సమీకృత బాలుర వసతి గృహం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సౌకర్యాలు కొరవడ్డాయి. సోలార్ సిస్టం పాడైంది, మరుగుదొడ్లు సక్రమంగా లేవు, వాడకం నీరు, మురుగు హాస్టల్ ఆవరణలో నిలిచిపోతుంది. వర్షం పడితే వసతిగృహం ఆవరణ నీట మునుగుతోంది. విద్యార్థులకు రక్షిత నీరు లేదు. ప్రస్తుతం 50 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఆరుగురు సిబ్బందిలో ఇద్దరు కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. దెందులూరు ఎమ్మెల్యే మట్టి గ్రావెల్‌తో హాస్టల్ ఆవరణ మెరక చేయించడంతో ముంపు సమస్యకు తెరపడినా మురుగు సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

అద్దె భవనాలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వసతి గృహాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో 113 మంది విద్యార్థులున్నారు. ఇంటర్ విద్యార్థులు 103 మంది, డిగ్రీ విద్యార్థులు 10 మంది కాగా సోమవారం 38 మంది విద్యార్థులు మాత్రమే హాస్టల్‌లో ఉన్నారు. మిగిలిన విద్యార్థులు దసరా సెలవులకు ఇళ్లకు వెళ్లి ఇంకా తిరిగి రాలేదని హాస్టల్ వార్డెన్ శివయ్య తెలిపారు. హాస్టల్ భవనం అద్దె దాదాపు రూ.6లక్షలు. చిన్న చిన్న గదుల్లో పది మంది చొప్పున కిక్కిరిసి పడుకుంటున్నారు. మరుగుదొడ్లు నిర్వహణలోపంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. వంట చేయడానికి హాస్టల్ వార్డెన్ ఇద్దరు మహిళలను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. వాచ్‌మెన్ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కొరవడింది. సౌకర్యాలు అంతంత మాత్రమే.

పెచ్చులూడుతున్న భవనాలు

ఏలూరు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. గత నెల నుంచి నూతన మెనూ అమలుకు ప్రభుత్వం ఆదేశించినా అమలు కావడం లేదు. ఏలూరు బాలికల సాంఘిక సంక్షేమ హస్టళ్లలో మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అనేక చోట్ల పెచ్చులూడిన భవనాలలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. వరండా కుంగిపోయి, హాస్టల్ వెనుక భాగంలో గోడ కూలిపోయింది. కొంతమంది ఆకతాయిలు బాలికలను వేధిస్తున్నట్లు తెలిసింది.

హాస్టల్ సౌకర్యాలు అంతంత మాత్రం

ఉంగుటూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్షేమ హాస్టళ్ల పనితీరు అంతంత మాత్రంగా ఉంది. నారాయణపురం, కైకరం, ఉంగుటూరు, బొమ్మిడి వసతి గృహాలలో పూర్తి సౌకర్యాలు లేవు. బాలికల వసతి గృహాలలో మరిన్ని ఇబ్బందులు. నారాయణపురంలో 60 మంది, ఉంగుటూరులో 45 మందికి 36 మంది, కైకరంలో 55 మంది హాజరయ్యారు.

వార్డెన్ లేరు

ఆకివీడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ బాలురు వసతిగృహానికి పూర్తిస్థాయి సంక్షేమ అధికారి (హెచ్‌డబ్ల్యూవో) లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పని చేస్తున్న పాలపతి శ్రీధర్‌పై ఆరోపణల నేపథ్యంలో మెడికల్ లీవులో వెళ్లడంతో అధికారులు పిలిపించి విచారణ చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఫణికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మరుగుదొడ్లు, బాతురూమ్‌లు, పైపుల మరమ్మతులు చేయించాలని ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

సచివాలయంలో హాస్టల్

పెంటపాడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెంటపాడులో ఎస్సీ బాలురు, బాలికలు, పరిమెళ్లలో ఎస్సీ బాలుర వసతి గృహాలున్నాయి. బీసీ హాస్టల్‌లో విద్యార్థులు లేకపోవడంతో వసతిగృహ భవనంలో కొన్నిరోజులు సచివాలయం నిర్వహించారు. ప్రస్తుతం సచివాలయ భవనం నిర్మాణం పూర్తి కావడంతో అది ఖాళీగా ఉంది. బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులను ఖాళీగా ఉన్న సచివాలయం 1 భవనంలోకి మార్చారు.



ఆకివీడులో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



జంగారెడ్డిగూడెంలో ఇరుకు గదిలో పడుకున్న విద్యార్థులు



నారాయణపురం బాలికల వసతిగృహంలో అల్పాహారం

సౌకర్యాలు మెరుగుపరిచారు



నరసాపురం ఎస్టీ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

తణుకు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం పైడిపర్రులోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో కూటమి ప్రభుత్వం సౌకర్యాలు మెరుగుపరచడంతో ఆహ్లాదకర వాతావరణ ఏర్పడింది. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.5 కోట్లతో నిర్మించిన జీ ప్లస్ 1 భవనాలు 2018లో ప్రారంభించారు. పట్టణ, గ్రామానికి దూరంగా నిర్మించిన భవనాలలో ఎస్సీ విద్యార్థులకు రెండు కళాశాల హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. అయితే చిన్నపాటి మరమ్మతులను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. ప్రస్తుతం వసతి పొందిన ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఇంజనీరింగ్ విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపరిచారు. మొత్తం 100 మంది విద్యార్థులకు వసతి అవకాశం ఉన్నా ప్రస్తుతం 40 మంది ఉన్నారు. విద్యార్థులు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం తమ వెంట తీసుకెళ్లి, రాత్రి భోజనం హాస్టల్‌లో చేస్తున్నారు.

నరసాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. మెనూతో పాటు కాస్మొటిక్ చార్జీలను కూడా విద్యార్థులకు అందిస్తున్నారు. గతంలో అరకొర సౌకర్యాల కారణంగా విద్యార్థుల సంఖ్య తక్కువ. ప్రస్తుతం సౌకర్యాలు మెరుగుపరచడంతో 70 మంది విద్యార్థులున్నారు. ఇటీవల బాత్‌రూమ్‌లు, హాస్టల్ భవనాలు మరమ్మతు చేయించారు. దోమల తెరలు, దుప్పట్లు ఇప్పటికే అందించారు.



పైడిపర్రు ఎస్సీ కళాశాల హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆచంట (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం వల్లూరు బాలికల బీసీ హాస్టల్‌లో మెరుగైన వసతులు కల్పించారు. హాస్టల్‌లో ప్రస్తుతం 25 మంది బాలికలు ఉన్నారు. దసరా సెలవుల అనంతరం మరికొందరు విద్యార్థులు రావలసి ఉంది. హాస్టల్‌లో అల్పాహారం, భోజనం, తాగునీరు వసతులపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.



వర్షంతో ఛిద్రమైన మొగల్తూరు-వెంప ఆర్ అండ్ బీ రహదారి



కుక్కునూరు - అశ్వారావుపేట రహదారి



ఆకివీడు మండలంలో తాళ్లకోడు కాలనీలో అడుగు పెట్టడానికి కూడా వీలులేని రోడ్డు

రహదారులు ఛిద్రం

- వర్షాలతో మరింత అధ్వానం
- అడుగడుగునా గోతులు
- తరచు ప్రమాదాలు
- వాహనాలకు మరమ్మతులు
- నడక కూడా కష్టమే

రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. దీనికితోడు వర్షాలతో పూర్తిగా ఛిద్రమయ్యాయి. ఆర్ అండ్ బీ రహదారులపై వాహన రాకపోకలు సాగించడం సాహసమే. గ్రామీణ రహదారులు అడగుగడుగునా గోతులతో అస్తవ్యస్తంగా మారితే పలు గ్రామాల్లోని కాలనీ రహదారులు అసలు అడుగే పెట్టలేని పరిస్థితి. అధిక శాతం రోడ్లు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతుంటే ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణంలో బిల్లుల చెల్లింపులో జాప్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో అంతర్గత రహదారులు ప్రమాదాలకు మార్గంగా ఉన్నాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కునూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు-భద్రాచలం, కుక్కునూరు - అశ్వారావుపేట ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి మళ్లీ గోతులమయంగా మారింది. రహదారిపై గుంతల్లో వర్షపు నీరు చేరి వాహనాన్ని ముందుకు నడపలేని పరిస్థితి ఏర్పడింది. పదేళ్లుగా ఈ రహదారిపై ప్రజలు నరకం చూశారు. తిరిగి అదే పరిస్థితి నెలకొంది. గతేడాది నుంచి ఈ రహదారి పనులు ప్రారంభమైనా ఇప్పటికీ పూర్తి కాలేదు. పనులు పూర్తయిన చోట మళ్లీ గుంతలు పడ్డాయి. కుక్కునూరు, వేలేరుపాడు ప్రజలు తెలంగాణలోని భద్రాచలం, అశ్వారావుపేట ఇతర ప్రాంతాలకు ఈ ప్రధాన రహదారిపై నిత్యం ప్రయాణిస్తుంటారు. వైసీపీ హయాంలో అధ్వానంగా మారిన 40 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి దాదాపు రూ.36 కోట్ల నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టరు 8 కిలోమీటర్లు పనులు చేసిన అనంతరం బిల్లులు రాకపోవడంతో పనులు చేయలేదు. అనంతరం కూటమి ప్రభుత్వం పనులు చేపట్టి సింగిల్ లేయర్ తారు పనులు పూర్తయ్యాయి. బిల్లు చెల్లింపులో జాప్యంతో సెకండ్ లేయర్ తారు పనులు జరగలేదు. అధిక వర్షాలతో గోతులు పడ్డాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ హరికృష్ణ మాట్లాడుతూ బిల్లు చెల్లింపులో జాప్యం వాస్తవమే. నవంబర్ నుంచి రహదారి పనులు మొదలవుతాయని తెలిపారు.

నిధులున్నా కదలని పనులు..

మొగల్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా రహదారి నిర్మాణానికి మోక్షం లేదు. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్ నుంచి భీమవరం మండలం వెంప గ్రామం వరకూ ఐదు కిలో మీటర్ల ఆర్‌అండ్‌బి రహదారికి 2020 నవంబరులో వైసీపీ ప్రభుత్వం రూ.12.64 కోట్లు మంజూరు చేసింది. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్ నుంచి వెంప వంతెన వరకూ 5.200 కిలో మీటర్ల రహదారి వెడల్పు చేయడం, నిర్మాణ పనులు నోచుకోకపోవడంతో శంకుస్థాపనకే పరిమితమైంది. రహదారి పెద్ద గోతులు మారి చినుకు పడితే గోతులు నీటితో నిండి ప్రయాణం నరకంగా మారింది. మొగల్తూరు పంచాయతీ పేట పల్లం, పెద్దగొల్లగూడెం, పడమటిపాలెం, నక్కావారి పాలెం, గోగులమ్మపేట, కొత్తపాలెం గ్రామస్తులతో పాటు మొగల్తూరులోని ప్రభుత్వ కార్యాలయాలకు, విద్య, వైద్య అవసరాలకు జిల్లా కేంద్రం కోసం భీమవరం వెళ్లడానికి తిప్పలు తప్పడం లేదు.

కాంట్రాక్టు రద్దుకు సిఫారసు

మొగల్తూరు-వెంప రహదారి నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకపోవడంతో కాంట్రాక్టు రద్దుచేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు ఆర్‌అండ్‌బి అధికారులు తెలిపారు. యుద్ధప్రాతిపదికన రహదారి నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లు అధ్వానం

ఏలూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పల్లె ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి ప్రధాన రహదారి అస్తవ్యస్తమైంది. తారు తుడిచి పెట్టుకుపోయి కంకర తేలింది. గుంతల్లో వర్షపునీరు చేరి ఎక్కడ గుంత ఉందో గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేస్తే రాకపోకలకు సౌలభ్యంగా మారుతుందంటున్నారు.

కామవరపుకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాలకు గ్రామీణ అంతర్గత రహదారులు ఛిద్రమయ్యాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులను అభివృద్ధి చేయాలని, కనీసం గోతులను పూడ్చాలని గ్రామీన ప్రజలు కోరుతున్నారు.

వర్షం కురిస్తే అడుగు పెట్టలేం

ఆకివీడు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే తాళ్లకోడు కాలనీవాసులు అడుగు బయట పెట్టలేని పరిస్థితి. మండలంలోని ఆకివీడు, కుప్పనపూడి, అజ్జమూరు, దుంపగడప, కోళ్లపర్రు, కళింగపాలెం గ్రామాల ప్రజలకు తాళ్లకోడులోని 74 ఎకరాల్లో ఇంటి స్థలాలు కేటాయించారు. మౌలిక వసతులు కల్పించకుండానే గత ప్రభుత్వం ఒత్తిడితో ఇళ్లు నిర్మించుకునేలా చేసింది. అక్కడ పరిస్థితి దయనీయంగా ఉంది. వర్షం కురిస్తే అడగు బయట పెట్టలేనంతగా రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. వాహనాలు వెళితే గాడులు పడుతున్నాయి. మురుగునీరు, వర్షం నీరు వెళ్లేందుకు కచ్చా డ్రెయిన్లు కూడా లేకపోవడంతో పరిస్థితి మరింత దుర్భరంగా ఉందని, చీకటి పడితే దోమలు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. చీకటి పడేలోపు ఇంటికి చేరకుంటే ఎక్కడైనా ఉండిపోవాల్సిందే. ఉపాధిహామీ పథకంతోనైనా కచ్చా డ్రెయిన్లు తవ్వి మురుగునీరు బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్లు త్వరిత గతిన నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఏలూరు జాలిపూడి రహదారిపై గుంతల్లో వర్షపు నీరు



పెనుగొండలో వర్షపు నీటితో మునిగిన రహదారి



గోతుల మయమైన కామవరపుకోట గ్రామీణ రహదారి

కార్తీక మాసం ఏర్పాట్లకు పందిరి రాట


కార్తీక మాసం ఏర్పాట్ల నిమిత్తం పందిరి రాట పాతుతున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రానున్న కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రమైన శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఉదయం 10.10 గంటలకు స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రంలో ఆలయం ఈశాన్య ప్రదేశంలో పందిరి రాటను పాతారు. కాగా సప్త సోమవారాలు.. సప్త ప్రదక్షిణలు కార్యక్రమంలో భాగంగా సోమవారం వందలాది మంది భక్తులు మాడవీధుల ప్రదక్షిణలు చేశారు.

రసాయన ఎరువులతో దోమపోటు


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. దయాకర్

ఆచంట, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):సార్వా వరిలో ఆశించే దోమ పోటు ఎక్కువగా రావడానికి అధికమోతాదులో రసాయన ఎరువులు వాడటమేనని పరిశోధనా స్థానం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.దయాకర్ అన్నారు. ఆచంట మండలం ఎ. వేమవరం శివారు పడమటిపాలెంలో మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కంబైండ్ హార్వెస్టర్‌తో కోత కోసిన పొలాలలో గడ్డి తగులబెట్టకుండా నేలలో కలియదున్నడం వల్ల సుమారు 25 శాతం రసాయన ఎరువుల అవసరం తగ్గుతుందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. గిరిజారాణి మాట్లాడుతూ దళ్వా రకాలైన ఎంటీయు 1293, ఎంటీయు1282 రకాలు నవంబరు నెలాఖరు కల్లా రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారమన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌కు మాంటిస్సోరి విద్యార్థులు


విజేతలతో మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ ప్రకాశరావు

తణుకు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తణుకు మాంటిస్సోరి విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా కొవ్వలిలో జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు చేకూరి రిత్విక్ వర్మ అండర్-14 జిల్లా జట్టుకు, బవిరిశెట్టి ఎస్.వి.ఎస్.హర్ష వీరేంద్ర అండర్17 జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

రోలర్ స్కేటింగ్‌లో పతకాలు..

ఈ నెల 11,12, తేదీలలో ఏలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో తమ తమ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారని ప్రకాశరావు తెలిపారు. కుడప శ్రీమాధవ, అండర్ 8-10లో ఆళ్ళ శ్రీహరి ప్రకాశ్, క్వాడ్‌లో ఆళ్ళ శైలజ, అండర్ 10-12లో చిక్కాల లావణ్య, చేకూరి కనిష్ వర్మ పతకాలు సాధించినట్టు తెలిపారు. నవంబరు 1,2,3, తేదీలలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-6, 8 కుడప శ్రీమాధవ, అండర్8-10 ఆళ్ళ శ్రీహరి ప్రకాశ్, అండర్10-12 చిక్కాల లావణ్యలు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

జిల్లా టీవీ టెక్నీషియన్ల కార్యవర్గ ఎన్నిక



పాలకొల్లు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా టీవీ టెక్నీషియన్ల కార్యవర్గ ఎన్నిక స్థానిక సమతా మహిళ మండలి భవనంలో సోమవారం జరిగింది. రాష్ట్ర టీవీ టెక్నీషియన్ల కుటుంబ సంక్షేమ ట్రస్ట్ బోర్డు వైస్ చైర్మన్ మానెం బసరాజు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు చేకూరి దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ టీవీ టెక్నీషియన్ల సమస్యలు, వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎతటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన రెడ్డి మాట్లాడారు. అనంతరం జిల్లా టీవీ టెక్నీషయన్ల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రెసిడెంట్‌గా బండి దుర్గా ప్రసాద్ (టిపిగూడెం), ప్రధాన కార్యదర్శిగా ఈమని గ్రీష్మకుమార్, కోశాధికారిగా నిమ్మ శ్రీధర్, 9మంది కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

20లోపు ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

గణపవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):ఉపాధి కూలీలంతా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో బేబిశ్రీలక్ష్మి కోరారు. ఉపాధిహామీ పనులపై గణపవరం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఫీల్డ్‌అసిస్టెంట్లు మేట్స్ ద్వారా ఈకేవైసీ పనులు చేయించుకున్న శ్రామికులకు మాత్రమే ఉపాధి పని చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఈ నెల 20వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.

3 నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె

తణుకు, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్క రించాలని కోరుతూ వచ్చేనెల 3 నుంచి సమ్మెకు సమాయ త్తమవుతున్నారు. ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, తణుకు యూనియన్ గౌరవాధ్యక్షుడు బొద్దాని నాగరాజు ఈ వివరాలు వెల్లడించారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ 12వ పీఆర్సీ ప్రకటించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, రిటైర్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భీమవరం టౌన్: తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అందుకే వచ్చేనెల 3వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నామని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు తెలిపారు. సమ్మె నోటీసును మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి నాయకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మృతి చెందిన, రిటైర్డు అయినటువంటి ఔట్ సోర్సింగ్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, 12వ పిఆర్సీ ప్రక టించి 30 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జీఎస్టీ హేలాపురి ఉత్సవాలు

సడలింపులపై అవగాహన ర్యాలీ.. బుల్లెట్‌పై కలెక్టర్ వెట్రిసెల్వి


స్టాల్‌ను సందర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో మరింత అవగాహన కోసం హేలాపురి ఉత్సవాలు పేరిట వారం రోజు వివిధ కార్యక్రమాలకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. నగరంలో శాంతినగర్ పోలీస్ పెట్రోల్ బంకు నుంచి పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీని కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ అభిషేక్ గౌడ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. హెల్మెట్లు ధరించి బైక్‌లతో ముందుకు సాగగా, కలెక్టర్ వెట్రిసెల్వి పోలీస్ అధికారి బుల్లెట్ ఎక్కి సాగడం గమనార్హం. ఉత్సవాల్లో భాగంగా గిరిజన భవన్‌లో గ్రాండ్ షాపింగ్ ఫెస్టివల్‌ను కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగినప్పుడు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సీఆర్‌రెడ్డి కళాశాలలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. అధిక మొత్తంలో షాపింగ్ చేసిన వారి పేర్లను ఉత్సవం చివరి రోజు డ్రా తీసి ముగ్గురికి బహుమతులు అందిస్తామని కలెక్టర్ ప్రకటిం చారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బి.నాగార్జునరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, డీటీసీ షేక్ కరీమ్, కార్మిక శాఖ డీసీ జి.నాగేశ్వరరావు, కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.



నగరంలో జీఎస్టీ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ర్యాలీలో ఎస్పీ కేపీఎస్ కిశోర్

మంత్రి పార్థసారధికి ఆహ్వానం

జీఎస్టీ సంస్కరణలపై నిర్వహిస్తున్న హేలాపురి ఉత్సవ్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని మంత్రి కొలుసు పార్థసారధికి కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఆహ్వానించారు. ఆయన వెంట జి.జాన్‌బాబు ఉన్నారు.



జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం ప్రభుత్వాసుపత్రుల వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికులు ధర్నా

- విధుల బహిష్కరణ
- వేతన బకాయిల కోసం డిమాండ్
- సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం/చింతలపూడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు జీతాలు, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పారిశుధ్య కార్మికులు కలిసి సోమవారం విధులను బహిష్కరించి ధర్నా చేశారు. గత కొన్ని నెలలుగా తమ సమస్యలను పరిష్కరించాలని తమ జీతాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని ఎన్నిసార్లు జిల్లా ఉన్నతాధికారులకు, ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ సెకండరీ హెల్త్ అధికారులకు ఎన్ని లేఖలు రాసినా ప్రయోజనం లేకపోవడం బాధాకరమన్నారు. వెంటనే అధికారులు ఇప్పటికైనా స్పందించి జీతాల బకాయిలను, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. బుట్టాయిగూడెం, దెందులూరు, భీమడోలు పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. చింతలపూడి ఏరియా ఆస్పత్రి వద్ద కార్మిక నాయకురాలు టి.మరియమ్మ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. జంగారెడ్డిగూడెంలో ఏఐటీయూసీ నాయకులు జంపన వెంకట రమణ రాజు, వేముల రాజు, మేరీ, దయామణి, జె.దుర్గారావు పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యాలపై సమీక్షిస్తున్న జేసీ అభిషేక్ గౌడ

4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

- రైతులకు ఇబ్బంది లేకుండా సేకరించాలి
- అధికారులతో జేసీ అభిషేక్ గౌడ సమీక్ష

ఏలూరుసిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాలను సాధించేందుకు పటిష్ట ప్రణాళికతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాలు, ప్రణాళికలపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించామని, ఏ ఒక్క రైతుకు ఎటువంటి సమస్య రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు తరచూ వచ్చే గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలు, తేమ శాతం తదితర సమస్యలు, ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వాటిపై ముందుగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించాలని, ధాన్యం సేకరణలో రైతులు, మిల్లర్లు, రవాణాపరమైన ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ దేవకీదేవి, డీఎస్‌వో ఈబి విలియమ్స్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పి.శివరామమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా, డీపీవో ఆరిమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల బీమా చెల్లింపులకు నిధులు విడుదల

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీం కింద రూ.5.30 కోట్ల విలువైన క్లైములను ఉపయోగించుకోవటానికి ప్రభుత్వం మత్స్యశాఖకు అనుమతి ఇచ్చింది. 19 జిల్లాల్లోని 106 మంది మత్స్యకారుల డెత్ క్లైములను పరిష్కరించడానికి ఈ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.


గోకుల పారిజాతగిరిలో హుండీ ఆదాయం లెక్కింపు

గోకుల పారిజాతగిరి వెంకన్న హుండీ

ఆదాయం రూ.12.88 లక్షలు

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. మూడు నెలలకు గానూ 12,88,615 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బాబు నాయుడు ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కింపు జరిగిందని ఈవో తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అబ్బిన దత్తాత్రేయ, జి.భాస్కరరాజు, వాసవీ సాయి నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో గల్లంతైన బాలుడి మృతి

తణుకు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాలువలో ఆదివారం ప్రమాదవశాత్తు గల్లంతైన బాలుడి మృతదేహం సోమవారం లభించింది.ఆదివారం మధ్యాహ్నం తణుకు రూరల్ మండలం పైడిపర్రులో అత్తిలి కాలువలో స్నానం చేసేందుకు బొమ్మనబోయిన జోగేంద్ర(13) దిగాడు. ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి గల్లంతవడంతో సోమవారం ఉదయం అత్తిలి మండలం గుమ్మపాడు గ్రామంలో కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించిన పోలీసులకు సమాచారం అందించారు. తణుకు రూరల్ ఎస్‌ఐ కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మొగల్తూరు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు మొగల్తూరు ఏఎస్‌ఐ సుబానీ తెలిపారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన ఒక కుటుంబం ఇటీవల మొగల్తూరు నాగదేవత కాలనీకి వచ్చి నివాసం ఉంటోంది.ఆ కుటుంబానికి చెందిన బాలిక(13) సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్టు

లింగపాలెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో ఐదుగురిని ధర్మాజీగూడెం పోలీసులు అరెస్టు చేశారు. లింగపాలెం గ్రామానికి చెందిన దంపతులు గత నెల 23న పెదవేగి మండలం బాపిరాజుగూడెం వెళ్లి ధర్మాజీగూడెం నుంచి వస్తుండగా మార్గమధ్యలో కొందరు మహిళ మెడలోని గొలుసు లాక్కుని పరారైనట్టు తెలిపారు. నిందితులు వలసపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్నట్టు సమాచారం తెలుసుకుని ఎస్‌ఐ వెంకన్న తన సిబ్బందితో వెళ్లి చాకచక్యంగా అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును రికవరీ చేశారు.

బొండాడలో ఎక్సైజ్ దాడులు

కాళ్ళ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల మండలం బొండాడ గ్రామంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఏడు క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్‌ఐ వి.కరుణప్రియ తెలిపారు.

రౌడీ షీటర్‌పై హత్యాయత్నం కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పాతగొడవల నేపథ్యంలో ఒక వ్యక్తిపై ఇనుపరేకుతో పీకకోయడానికి యత్నించిన రౌడీ షీటర్‌పై ఏలూరు టూటౌన్ పోలీసులు హత్యాయత్నం కేసును నమోదు చేశారు. ఏలూరు ఎంఆర్‌సీ కాలనీలో ఇటీవల కనకదుర్గమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ గొడవ జరిగింది. గొడవను పురస్కరించుకుని అదే ప్రాంతానికి చెందిన సుందరపు గంగాధరరావుపై యడ్ల గణేశ్ కక్షపెంచుకున్నాడు. ఈ నెల 12న ఆ గుడి వద్ద అన్న సంతర్పణ జరిగిన సమయంలో గంగాధరరావుపై యడ్ల గణేశ్ ఇనుపరేకుతో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గంగాధరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధ భరించలేక ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఒక వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై విజయవాడలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఏలూరు కత్తేపు వీధికి చెందిన పుప్పాల పవన్‌కుమార్(40) లారీల ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ట్రాన్స్‌పోర్టు వ్యాపారంలో భారీగా నష్టాలు రావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఈనెల 11న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు అందడంతో ఎస్‌ఐ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల మృతి

ఏలూరుక్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):రైలు ప్రమాదాల్లో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి చెందారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓవర్ బ్రిడ్జి కింద సోమవారం ఉదయం ఒక గుర్తు తెలియని దివ్యాంగుడు పట్టాలపై నడిచి వెళ్తున్నాడు. ప్రమాద వశాత్తు అదే సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి కుడి కన్ను, కుడి చేయి లేదు. ఇతను ఎక్కడివాడో ఇక్కడకు ఎందుకు వచ్చాడో కూడా తెలియదు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ రత్నం, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ వారి సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

- భీమవరం క్రైం: భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకివీడు-పల్లెవాడ రైల్వే స్టేషన్ మధ్యలో గుర్తు తెలియని వృద్ధుడు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఆకివీడు స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో భీమవరం జీఆర్‌పీ ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 60 ఏళ్ల వ్యక్తి తెలుపు రంగు చొక్కా, పర్పుల్ కలర్ లుంగీ ధరించి ఉన్నాడని అన్నారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని ఒకరికి గాయాలు

మొగల్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు జాతీయ రహదారిపై సోమవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన ఎక్స్‌కవేటర్ ఢీకొట్టింది. మొగల్తూరు జాతీయ రహదారిపై హెరిటేజ్ పాలకేంద్రం వద్ద లారీలో పాల లోడు దిగుతున్న సమయంలో అటు పక్కగా పెట్రోల్ బంక్ నుంచి వస్తున్న ఎక్స్‌కవేటర్ ఎదురుగా వస్తున్న స్కూటరిస్ట్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న మొగల్తూరు పంచాయతీ పరిధి కొత్తకాయలతిప్ప గ్రామానికి చెందిన నడపన వీరాస్వామి అనే వ్యక్తికి కాలు ఇరిగడంతో పాటు తలకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు స్పందించి 108 వాహనంలో భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు చేయలేదని ఆసుపత్రి నుంచి సమాచారం వచ్చిన తరువాత కేసు నమోదు చేస్తామని మొగల్తూరు పోలీసులు తెలిపారు.


గాయపడిన వీరాస్వామి

బాణసంచా స్వాధీనం

చింతలపూడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రగడవరంలో పోలీసులు దాడులు చేసి మూడుచోట్ల తనిఖీలు జరిపి అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ అక్రమ తయారీ, నిల్వలపై లైసెన్సు లేకుండా గొడౌన్లలో ఉంచిన ఐదు లక్షల విలువైన బాణసంచాను పట్టుకున్నట్లు తెలిపారు. చంద్రుపట్ల హరీశ్, పసుమర్తి రాంబాబు, చిన్ని నాగబాబులకు చెందిన వీటిని రెవెన్యూ అధికారుల సాయంతో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్‌ఐ సతీశ్‌కుమార్ తెలిపారు.


మందుగుండు సామగ్రి పరిశీలిస్తున్న పోలీసులు

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఉండి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి ఉండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకువాడ గ్రామానికి చెందిన కొల్లిపర విజయలక్ష్మితో హైదరాబాద్‌లో ఉంటున్న మామని ప్రసాద్‌కు 12 ఏళ్లక్రితం ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రెండు లక్షల నగదు, బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. కొంతకాలం కాపురం సజావుగానే సాగింది. కట్నం కోసం భార్య విజయలక్ష్మిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తూ ఇంటి నుంచి గెంటి వేశారు. హైదరాబాద్ నుంచి ఆమె చెరుకువాడకు చేరుకుంది. తదుపరి ఉండి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి భర్త, అత్తమామలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్‌ఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీ కేసులో ఐదుగురి అరెస్టు

చింతలపూడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బంగారం చోరీ కేసులో ఐదుగురు యువకులను అరెస్టు చేసినట్టు జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ధర్మాజీగూడెం స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. ధర్మాజీగూడెంతో పాటు భీమడోలు, ఆగిరిపల్లి, ఏలూరుత్రీటౌన్ పరిధిలో మొత్తం 80 గ్రాముల బంగారం చోరీ చేశారని సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. చావల భార్గవకృష్ణ, బరగడ హర్షవర్ధన్, కాకపర్తి గణేశ్, బద్ది హేమ అచ్యుత్, కోలా అప్పలరాజులను అరెస్టు చేశామని వీరంతా ఏలూరు నగరానికి చెందినవారన్నారు. మీడియా సమావేశంలో చింతలపూడి సీఐ క్రాంతి కుమార్, ఎస్‌ఐలు సతీశ్ కుమార్, కె.వెంకన్నలు పాల్గొన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

తాడేపల్లిగూడెంరూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంటలో భార్య మందలించిందని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోదుగగుంటకు చెందిన దండ్రు వెంకట్రావు(50) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 12న మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంటి వద్ద ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించడంతో భార్య మందలించింది. దీంతో ఇంటికి ఎదురుగా ఉన్న పంట చేల వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడు దండ్రు దుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ ఎండీ జిలాని తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ద్వారకాతిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఓ వివాహానికి ద్వారకాతిరుమలకు వచ్చిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు తూలిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన యార్లగడ్డ సాంబశివరావు(80)తన మనవరాలి వివాహం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 11 రాత్రి ద్వారకాతిరుమలకు వచ్చి ఓ గదిలో ఉన్నారు. 12న తెల్లవారు జామున బాత్‌రూమ్ నుంచి బయటకు వస్తుండగా గడప తగిలి ముందుకు పడి గాయాలపాలయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. సుధీర్ తెలిపారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

కుక్కునూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు గ్రామ శివారులోని రామాలయం వద్ద సోమవారం ఉదయం ఓకారు ప్రమాద వశాత్తు రహదారి పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది.కారులో ప్రయాణిస్తున్న రాజమండ్రికి చెందిన జాన్ షడక్, రాణి దంపతులు తెలంగాణ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పల్టీ కొట్టిన కారు నుంచి వారిని స్థానికులు బయటకు తీశారు. చిన్నచిన్న గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో కారును బయటకు తీశారు. రాజమండ్రి నుంచి తెలంగాణలోని చర్ల గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.



17 నుంచి ధన్వంతరీ జయంతోత్సవాలు

భీమవరం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి భీమవరంలో నాయీ బ్రాహ్మణ జేసీ ఆధ్వర్యంలో శ్రీధన్వంతరి జయంతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయీ బ్రాహ్మణ జేఏసీ ప్రెసిడెంట్ పట్నాల గణపతి (తాడేపల్లిగూడెం), జెఏసీ భీమవరం అధ్యక్షుడు కోడూరి రామకృష్ణ తెలిపారు. సోమవారం భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ధన్వంతరి జయంతోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

గణపవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులందరూ తమ చెరువులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని గణపవరం మత్స్యశాఖాభివృద్ధి అధికారి ఎన్.శివరామకృష్ణ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో లక్ష 32వేల 563 ఎకరాలకుగానూ ఇప్పటి వరకు 50,449 ఎకరాలు మాత్రమే అప్సడా చట్టపరిధిలో లైసెన్సులు పొందారని అన్నారు. గణపవరం మండలంలో 3వేల ఎకరాల వరకు అప్సడా చట్టంలో నమోదు చేసుకోలేదన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ప్రభుత్వ పథకాలు లభిస్తాయన్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం: పితాని


సోమరాజుచెరువు గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

పెనుగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ లన్నీ అమలు చేస్తామని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం సోమరాజుచెరువు, కొఠాలపర్రు గ్రామాల్లో పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమం నిర్వహించారు. సిలిండర్‌లు సంవత్సరానికి మూడు ఇస్తామని హామీ ఇచ్చామని దానిలో భాగంగా రెండు సిలిండర్లకు ఇప్పటికే నగదు ఇచ్చామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. ప్రతి సమస్య పరిష్కారినికి తాను ఎల్లపుడూ కృషి చేస్తానని తెలిపారు. పెనుగొండ ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, మార్టేరు డీసీ చైర్మన్ జక్కంశెట్టి సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల లోకేశ్వరరావు, తహసీల్దార్ అనిత కుమారి, ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల చలో విజయవాడ

ఆకివీడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు సోమవారం విజయవాడలో నిర్వహించిన మహాధర్నాకు తరలారు. డిమాండ్స్ పరిష్కరించకపోతే బుధవారం నుంచి విధులకు హాజరుకారంటున్నారు. నగదు రహిత అపరిమిత వైద్య సౌకర్యం తక్షణమే అమలు చేయాలన్నారు. జీపీఎఫ్, పాత పింఛన్ విధానం వర్తింపజేయాలన్నారు. పదోన్నతులుకల్పించాలన్నారు

ఎంపీడీవోగా కృష్ణమూర్తి బాధ్యతలు



పెనుమంట్ర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర మండల అభివృద్ధి అధికారిగా (ఎఫ్ఏసీ) ఎస్ఎన్‌వీ ఎల్‌జె కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోగా పనిచేసిన ఎమ్మెస్ ప్రభాకర్‌రావు అనారోగ్యంతో బాధపడుతూ సెలవుపై ఉండడంతో పెనుమంట్ర పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ కృష్ణమూర్తికి ఎంపీడీవో ఎఫ్ఎసిగా ఇచ్చారు. అక్టోబర్ నెలలో పంచాయతీ ఉద్యోగులకు జీతాలు చేసేందుకు ఎంపీడీవో లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పాకా

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్ర జ్యోతి): బీసీల రాజకీయ రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్య నారాయణ అన్నారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ భవనంలో జరిగిన బీసీ నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాకా సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవానీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి

తణుకు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పర్యటించనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన విజయవంతం చేయాలని తణుకు ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకులు ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. సోమవారం ఓర్వకల్లు మండలం నన్నూరులో జరిగే సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మోదీ హాజరవుతారని చెప్పారు. ఇటీవల జీఎస్టీ తగ్గించి పేద, మధ్య తరగతి, దిగువ తరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. తణుకు నియోజవర్గం నుంచి 20వేల మందిని మోదీ సభకు తరలించే విధంగా కూటమి నాయకులు సమన్వయంతో పని చేయాలని కోరారు.

'కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు'

తణుకు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరిస్తుందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆరోపించారు. సోమవారం తణుకులోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్ద కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కారుమూరి మాట్లాడుతూ మద్యం ప్రియులు కల్తీ మద్యం తాగి ప్రాణాలు కోల్పోవద్దని, మద్యం తాగే ముందు తమ కుటుంబాలను, పిల్లలను దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు. తణుకులో గోవధను నిర్మూలించాలని అన్నారు.

పాలకొల్లు అర్బన్: నకిలీ మద్యం అంశంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి గుడాల గోపి ఆధ్వర్యంలో సోమవారం వర్షంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గుడాల గోపి మాట్లాడుతూ నకిలీ మద్యం అరికట్టి ప్రజల ప్రాణాలను రక్షించాలని కోరారు ఈకార్యక్రమంలో నాయకులు యడ్ల తాతాజీ, కోరాడ శ్రీను, ఖండవల్లి వాసు, ఎస్ నర్సయ్య, కర్రా జయ సరిత, మద్దా చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలోనే మద్యం కుంభకోణాలు'

తణుకు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణానికి పాల్పడింది గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి అనుచరులు కాదా అని తణుకు ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ ప్రశ్నించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తణుకు ఎక్సైజ్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ హయాంలోనే నకిలీ మద్యం తయారు చేసి ప్రజలకు సరపరా చేశారని ఆరోపించారు. జంగారెడ్డి గూడెంలో కల్తీ మద్యం తాగి 27మంది మృతి చెందితే ఆనాడు మంత్రి హోదాలో ఉండి కారుమూరి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.


తాడేపల్లిగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

ఆచంట, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా సోమవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి. కృష్ణమోహన్ మాట్లాడుతూ జీఎస్టీ రేట్లు తగ్గింపు వలన కొన్ని రంగాల్లో చిరు వ్యాపారులు, వినియోగదారులు, జొమాటో వంటి ఫుడ్‌డెలివరి వర్కర్స్‌కు కలిగే ప్రయోజనాలు వివరించారు.

తాడేపల్లిగూడెం రూరల్: పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం జీఎస్టీ పన్ను తగ్గింపు వరమని సీటీవో డి.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. జీఎస్టీపై అవగాహన ర్యాలీని సోమవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటర్స్, వ్యాపార కూడళ్ల సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు మోటారుసైకిల్స్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.చంద్రశేఖర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గోపికుమార్, డిప్యూటి ఎంపీడీవో ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా

తణుకు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం పట్ల కొంత మంది అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమం కోసం మండలస్థాయి అధికారులు కనీసం 32 మంది హాజరుకావాల్సి ఉంది. కానీ కేవలం 15మంది అధికారులు మాత్రమే రావడం జరిగింది. గ్రామాల నుంచి వచ్చే పలువురు ఫిర్యాదుదారులకు ఆయా శాఖల అధికారులు అందుబాటులో లేని పరిస్థితి నెలకొన్నది. ముఖ్యంగా రెవెన్యూతో పాటు పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, ఆర్టీసీ, దేవదేయశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ వంటి శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. ఇప్పటి కైనా అన్నిశాఖల అధికారులు హజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొవాలని ఫిర్యాదిదారులు కోరుతున్నారు.

ప్రతి వినతిని పరిష్కరిస్తాం

నరసాపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ప్రతి వినతిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆర్డీవో దాసిరాజు అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 26 వినతులు స్వీకరించారు. సరిహద్దు, పింఛన్లు, భూ వివాదాలు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై వినతులు తీసుకున్నారు. వచ్చిన వాటిని ఆన్‌లైన్ చేసి సమస్యల్ని పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు.


నరసాపురంలో ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో దాసిరాజు

ఆకివీడు: సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో డి.బాబూరావు, తహసీల్దార్ ఫరూక్ తెలిపారు.

మొగల్తూరు:మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒక ఫిర్యాదు అందినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. కెపిపాలెం నార్త్ గ్రామానికి చెందిన కందులపాటి బాలాజీ వివాదంలో ఉన్న తనకు చెందిన స్థలాన్ని సర్వే చేసి న్యాయం చేయాలని కోరుతూ వినతి అందించాడన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు


ఆర్టీసీ బస్సును తోస్తున్న ప్రయాణికులు

తణుకు, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): తణుకు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మార్గంమధ్యలో నిలిచిపోయింది. సోమవారం డిపో నుంచి బయలు దేరిన ఆర్టీసీ బస్సు కొంత దూరంలో మునిసిపల్ కార్యాలయం సమీపంలోకి వచ్చే సరికి ఆగిపోయింది. దీనితో బస్సులో ఉన్న మహిళా ప్రయాణికులతో పాటు స్థానికులు కలసి బస్సును తోసుకెళ్లారు. ఇలాంటి సంఘటనలు ఏదో ఒక చోట నిత్యం జరుగుతూనే ఉన్నాయి. దీనిపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ఆలయాల్లో ఏర్పాట్లు చేయాలి

భీమవరం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రానున్న కార్తీక మాసంలో దేవాలయాలు శోభాయమానంగా ఉండేలా సిద్ధం చెయ్యాలని అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కార్తీక మాసం ఏర్పాట్లపై సమీక్షిస్తూ ఈనెల 22 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్నదన్నారు. ఆలయాలకు రంగులు వేయడం, మరమ్మతులు, విద్యుత్ దీపాలు, క్యూ లైన్‌లు ఏర్పాటు వంటివి చేయాలని సూచించారు.

తెలుగు సాహితి సమాఖ్య కార్యవర్గం



తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం తెలుగు సాహితి సమాఖ్య అధ్యక్షునిగా మునిసిపల్ మాజీ కౌన్సిలర్ జంగా శ్రీనివాసరామ్‌రాయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి గట్టిం మాణిక్యాలరావు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని వాసవి కళ్యాణ మండపం వద్ద నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఎన్నిక నిర్వహించారు. సంఘ ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి రామచంద్రరావు, కోశాధికారిగా ఆడిటర్ నారాయణ వెంకట రామారావు ఎన్నికయ్యారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి


కెరీయర్ గైడెన్సు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తణుకు, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయా లని సంఘ సేవకులు డీవీవీఎస్ వర్మ అన్నారు. సోమవారం గమిని ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కెరీర్ గైడెన్సు కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన విజయీభవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా కెరీర్ గైడెన్సు కమిటి చైర్‌పర్సన్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి, జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, మానత నాయకులు అక్కిన కాశీ విశ్వనాథం, బోయపాటి రామలక్ష్మి, సత్యనారాయణమూర్తి, ఆనాల ఆదినారాయణరావు, చిట్టూరి సుజాత పాల్గొన్నారు

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం డిపో నుంచి కార్తిక మాసం ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్టు డిపో మేనేజర్ దానమ్మ తెలిపారు. శ్రీశైలానికి కార్తిక మాసంలో ప్రతి శుక్రవారం సూపర్ లగ్జరీ బస్సు బయల్దేరుతుందని ఈ బస్సులో శ్రీశైలం మహానంది, అహోబిలం, యాగంటి, బ్రహ్మంగారి మఠం, త్రిపురాంతకం, కోటప్పకొండ చిన్నకాకాని, మంగళగిరి క్షేత్రాల దర్శనం తరువాత మంగళవారం రాత్రికి తాడేపల్లిగూడెం డిపోకు చేరుతుందని ఈ బస్సు చార్జీ రూ.3వేలుగా నిర్ణయించామన్నారు. పంచారామక్షేత్రాలు ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు బస్సులు బయల్దేరతాయన్నారు. ఈ బస్సులు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట 5 క్షేత్రాలను ఒకే రోజు దర్శింప చేసి సోమవారం రాత్రికి తాడేపల్లిగూడెం డిపోకు చేరుకుంటారని ఈ బస్సు ధర రూ.1200గా నిర్ణయించామని తెలిపారు. గిరి ప్రదక్షిణ బస్సులు ప్రతి పౌర్ణమికి ఈ బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. అరుణాచల బస్సులు రూ.2600 చార్జిగా నిర్ణయించామన్నారు. ఈ బస్సులు తాడేపల్లిగూడెం నుంచి బయల్దేరి, శ్రీకాళహస్తి, కాణిపాకం, సిరిపురం లక్ష్మీదేవి ఆలయం, అరుణాచల స్వామి దర్శనం ఉంటుందని వివరించారు. నవజనార్దన క్షేత్రాలు దవళేశ్వరి, మడికి, ఆలమూరు, జొన్నాడ, మండపేట, కపలేశ్వరం, మాచర, కోటిపల్లి, కొండపల్లి క్షేత్రాలు తిప్పి చూపించేలా బస్సులు నడుపుతున్నామన్నారు. ఈ బస్సు చార్జీ రూ.300లు నిర్ణయించామన్నారు. భద్రాచలం దర్శించేందుకు రూ.600 చార్జీతో పారిజాతగిరి, మద్ది ఆంజనేయస్వామి ఆలయం, భద్రాచలం తిప్పి చూపించి వచ్చేలా ఈ బస్సులు నడుపుతున్నామన్నారు. వాటితో పాటు తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న ముక్తేశ్వరం, కుండ లేశ్వరం, మురమళ్ల, అంతర్వేతి, పాలకొల్లు అప్పనపల్లి ఆలయాలు దర్శించేందుకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఒకే రోజు సందర్శన ఉండే ఈ క్షేత్రాల దర్శనం కోసం రూ.400 చార్జీగా నిర్ణయించా మన్నారు.

నరసాపురం నుంచి ప్రత్యేక బస్సులు

నరసాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో నరసాపురం డిపో నుంచి పంచారామాలు, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపు తున్నట్లు డీఎం సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈనెల 26న నవంబర్ 2, 9, 16తేదీల్లో నరసాపురం నుంచి రాత్రి 7గంటలకు బస్సులు బయలు దేరుతా యన్నారు. పిల్లలకు రూ.720, పెద్దలకు రూ.800, ఎక్స్‌ప్రెస్ సర్వీస్ పిల్లలకు రూ.900, పెద్దలకు రూ.1200 చొప్పున టిక్కెట్లు ఉంటాయన్నారు. దీంతో పాటు శబరిమలై పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు సర్వీసులు కూడా నడుపు తామన్నారు. 30 మంది ప్రయాణికులు ఉంటే బస్సును మీ వద్ద నుంచే తీసుకెళుతుందన్నారు.

52 కేజీల విభూదితో ఏకాంబరేశ్వరస్వామికి పూజలు


ఏకాంబరేశ్వర స్వామి

నరసాపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):పట్టణంలో13వ వార్డులో కొలువైన ఏకాంబరేశ్వర స్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 52 కేజీల విభూదిలో స్వామివారికి భక్తులచే భస్మాభిషేకం పూజలు నిర్వహించారు. వేదపండితులు పురాణం గణేష్ అధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెంటపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, కార్యదర్శి నాగదేవి అన్నారు. సోమవారం పరిమెళ్ల గ్రామంలో డ్రెయినేజీలలో పూడికలు తీయించారు. ప్రజలు చెత్తా చెదారం డ్రెయినేజీలలో వేయివద్దని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

తాడేపల్లిగూడెం, అక్టోంబరు 13(ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పలువురు వక్తలు సూచించారు. డైమండ్స్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వైపరీత్యాల నిరోధక దినోత్సవం డైమండ్ లయన్స్‌క్లబ్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అధ్యక్షతన జరిగింది. లయన్స్‌క్లబ్ జిల్లా పూర్వాధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ ఉపాధ్యక్షుడు కాళ్ల గోపికృష్ణ, తమ్మాబత్తుల సత్యనారాయణ, కన్నాజీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'మార్క్స్ లిస్ట్‌లో తల్లిదండ్రుల పేర్లు లేవు'

భీమవరం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని ఏఆర్‌కేఆర్ హైస్కూల్‌లో గత ఏడాది చదివిన టెన్త్ విద్యార్థుల మార్కుల లిస్టులో తల్లిదండ్రుల పేర్లు నమోదు కాలేదంటూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతి పత్రం అందించారు. గత ఏడాది ఏఆర్‌కేఆర్ హైస్కూల్‌లో చదివిన వంద మంది విద్యార్థులకు తల్లిదండ్రుల పేర్లులేని మార్కుల లిస్టులు అందాయన్నారు. ఇప్పుడు వారి ఇంటర్మీడియెట్ ఎగ్జామినేషన్ ఫీజు చెల్లింపు సందర్భంలో ఒరిజినల్స్ అందించినప్పుడు ఇది బయటపడిందన్నారు. ఫీజు చెల్లింపు వీలు కాకుండా పోయిందని పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేయించి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఆర్థిక మంత్రిని కలిసిన కొవ్వలి



నరసాపురం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ మంగళగిరిలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సోమవారం టీడీపీ ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి కొవ్వలి నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, అభివృద్ధి, పెండింగ్ సమస్యలు తదితర విషయాలపై మంత్రితో చర్చించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని మంత్రికి విన్నవించినట్లు కొవ్వలి తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి సమస్యలు


మంగళగిరిలో వినతులు స్వీకరిస్తున్న పెద్దిరాజు

నరసాపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, పింఛ న్లు వంటివి ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని మత్స్యకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. సోమవారం మంగళగిరిలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖ ర్‌తో కలిసి గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వైసీపీ హయాంలో జరిగిన భూకబ్జాలు, పింఛన్లు తొలగించారంటూ విన్నవించారు.

బంధాల బలోపేతానికి ఉత్తరం దోహదం

భీమవరం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరానికి నాటి తరానికి ఎంతో అవినాభావ సంబంధం ఉండేదని, మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి ఉత్తరం ఎంతో ఉపయోగపడేదని, నాటి తరంలో తమ బంధువుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఉత్తరం కోసం ఎదురు చూసిన క్షణాలు మాధురానుభూతిని పంచేవని భీమవరం పోస్టల్ యూనియన్ లీడర్ లెనిన్ బాబు అన్నారు. భీమవరం సర్ సీవీ రామన్ స్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోస్టల్ సంక్షేమ పథకాలపై అవగాహన, కరపత్రాలు పంపిణీ చేశారు. స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.పార్వతి మాట్లాడుతూ తపాల శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

21 గ్రామాల్లో పంట మునకపై సర్వే

నరసాపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నరసాపురం, యలమంచిలి మండలాల్లోని 21 గ్రామాల్లో పంట మునకపై సర్వే చేపట్టనున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. 16 నుంచి వీఏలు జరిగిన నష్టంపై ప్రాథమికగా అంచనా వేసి నివేదిక ఇస్తారన్నారు. 17 నుంచి 21 వరకు అన్ని సచివాలయాల్లో జాబితాలను సిద్ధం చేసి నోటీస్ బోర్డుల్లో ఉంచుతామన్నారు. 21న అభ్యంతరాలు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బందికి రైతులు తెలియజేయవచ్చునన్నారు.

కవల పిల్లల వైద్యానికి రూ.10 లక్షలు సాయం


చెక్కు అందిస్తున్న విప్ నాయకర్

నరసాపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన గిరిధర్ తమ కవల పిల్లలకు వినికిడి లోపం వచ్చింది. ఆ పిల్లలకు సీఎం సహాయనిధి కింద రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం తండ్రి గిరిధర్‌కు విప్ నాయకర్ చెక్కును అందించారు. అలాగే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ శెట్టిబలిజ ఐక్య సంఘం కూడా వారికి అండగా నిలిచింది. తమవంతు సాయంగా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని కుడిపూడి సత్య, కేతా శెట్టి అందించారు.

పేకాట స్థావరాలపై దాడి

నరసాపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):బియ్యపుతిప్ప, సీతారాంపురం గ్రామాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. బియ్యపుతిప్ప వద్ద పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1800 నగదు, 52పేక ముక్కల్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. సీతారాంపురం సౌత్ శివారున ఒక ఇంటిపై మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగుర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.19,350 నగదు, 52పేక ముక్కల్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

స్కూల్‌లో చోరీ

నరసాపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) మండలంలోని గొంది గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆకతాయిలు బీభత్సం సృష్టించారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో స్కూల్ తలుపులు పగలగొట్టి పుస్తకాలు చిదరవందరంగా పడేశారు. టీవీ సెటాప్ బాక్స్‌ను ఎత్తుకుపోయారు. సోమవారం స్కూల్ తెరిచేందుకు వచ్చిన ఆయా తలుపులు తీయడాన్ని గుర్తించింది. హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరసాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లిచేసుకుంటానని మోసం

ఉండి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): పెళ్లిచేసుకుంటానని చెప్పి శారీరకంగా కలిసి తదుపరి తమ ఇంట్లో వారు ఒప్పుకోవడంలేదంటూ మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ఒక యువతిని మహదేవపట్నానికి చెందిన బొబ్బిలి కళ్యాణ్ ప్రేమపేరుతో 2015 నుంచి వెంటపడేవాడు. తదుపరి ఆమెను శారీరకంగా కలిశాడు. ఈనెల 6వ తేదీన పెళ్లిచేసుకోవాలని బాధితురాలు, కుటుంబసభ్యులు బొబ్బిలి కళ్యాణ్ ఇంటి వద్దకు వెళ్లారు. అందుకు అతను నిరాకరించాడు. బాధితరాలు ఆదివారం ఉండి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు ఆదిత్య విద్యార్థుల ఎంపిక

నరసాపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):ఇటీవల పట్టణంలోని మిషన్‌హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ క్రీడల్లో ఆదిత్య స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. 14, 17 ఏళ్ల బాలుర, బాలికల విభాగాల్లో కబడ్డీ, యోగా, లాంగ్‌జంప్, షాట్‌పుట్, చెస్ వంటి క్రీడల్లో ఈ విద్యార్థులు విజేతలుగా నిలిచి జిల్లాకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థుల్ని సోమవారం ప్రిన్సిపాల్ కర్ణ రాజేష్, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, పీఈటీ ఉపాధ్యాయులు కాకిలేటి ప్రసాద్, కుక్కల రవికుమార్ అభినందించారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్


డాక్టర్ మురళీకృష్ణను సత్కరిస్తున్న స్వర్ణాంధ్ర కళాశాల యాజమాన్యం

నరసాపురం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):కష్టపడి చదివితే ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెఎన్‌టీయూ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సోమవారం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో స్కిల్స్ ఎంప్లాయిబిలిటీ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. చదువుతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో వస్తున్న మార్పుల్ని ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. కొత్త కోర్సులపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ఆయన్ను కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ శ్రీహరి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, గోపిచంద్, విస్సా మాణిక్యాలరావు పాల్గొన్నారు.

చిత్ర యూనిట్‌కు సత్కారం

భీమవరం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భీమవరం టాకీస్ బ్యానర్లో తుమ్మలపల్లి రామసత్య నారాయణ నిర్మిస్తున్న 118వ చిత్రం మహా నాగచిత్రం షూటింగ్‌ను తిలకించి, యూనిట్‌ని మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ సినీ పరిశ్రమలో పాము అనేది యూనివర్సల్ సబ్జెక్టు అని, ప్రపంచంలో పాము కథతో వచ్చిన చిత్రాలన్నీ సూపర్ డూపర్ హిట్స్‌గా నిలిచాయని అన్నారు. పెంటపాడు మండలం రాచర్ల గ్రామంలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న షూటింగ్‌లో మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కో- కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్ గుప్తా, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, పరుచూరి నాగేశ్వరావు మాట్లాడారు. హీరోయిన్ శ్రావణి మాట్లాడుతూ తాను భీమవరంలోనే పెరిగానని, తనకు ఇది మొదటి చిత్రం అని తెలిపారు.

రేషన్ అక్రమాలకు చెక్ !

(5వ పేజీ తరువాయి)

అధికంగా సొంత అవసరాలకు ఉపయోగిస్తున్నారు. లేదంటే మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. జిల్లాలో సగటున ప్రతినెలా 40 శాతం అంటే 3,200 టన్నుల బియ్యం మార్కెట్‌కు తరలిపోతున్నాయి. లబ్ధిదారుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అంతిమంగా కాకినాడ పోర్టునుంచి విదేశాలకు తరలిపోతు న్నాయి. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. బియ్యాన్ని పట్టు కుంటే కిట్‌ల ద్వారా అక్కడికక్కడే నిర్ధారిం చేస్తారు. తక్షణ చర్యలు తీసుకుంటారు. మార్కెట్‌లోనూ వినియోగదారులకు వాటిని విక్రయించే అవకాశం ఉండదు.

రీసైక్లింగ్‌కు అడ్డుకట్ట

మిల్లర్లు రీసైక్లింగ్ చేసే అవకాశాలు పూర్తిగా తగ్గిపోతాయి. జిల్లాలో ఒకప్పుడు మిల్లర్లు రీసైక్లింగ్ చేసేవారు. రేషన్ బియ్యాన్నే ఎఫ్‌సీఐకి ఇచ్చేసేవారు. ఇటీవల మిల్లర్లలోనూ మార్పు వచ్చింది. ముఖ్యంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రీసైక్లింగ్ జరగకుండా కట్టుదిట్టం చేసింది. ఎవరైనా రీసైక్లింగ్‌కు పాల్పడితే కస్టమ్ మిల్లింగ్‌కు ధాన్యం ఇవ్వకుండా అధికా రులకు సూచిస్తోంది. అసోసి యేషన్ పరంగానూ సహకారమందించడం లేదు. దాంతో రీసైక్లింగ్ వ్యవహారం దాదాపు తగ్గిపో యింది. ఎక్కడో ఒక చోట ఉందంటే అసోసియేషన్ కన్నేస్తోంది. అటు వంటి వారిపై చర్యలు తీసుకునే ప్రయత్నాలు చేస్తోంది. దాంతో కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియ జిల్లాలో సజావుగా సాగుతోంది. ప్రభుత్వం సాఫీగా ధాన్యం కొనుగోలు చేస్తోంది. మిల్లర్లకు అప్పగి స్తోంది. తిరిగి బియ్యం తీసుకుంటోంది. రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి తిరిగి అప్పగిస్తే ఐరన్ కిట్‌ల ద్వారా తెలిసిపోతోంది. తద్వారా బియ్యం ఇచ్చే మిల్లర్లపైనా చర్యలకు ఆస్కారం ఉంటుంది.